



# తప్పయితే దాచెయ్.. దబాయించెయ్!

‘సుంకిశాల’పై ఇరకాటంలో కాంగ్రెస్ • బీఆర్ఎస్ సర్కారుపై నెట్టేసే కుట్ర • వేళ్లన్నీ రేవంత్ ప్రభుత్వం వైపే

## మేడిగడ్డ ఘటనపై గంటల్లోనే స్పందించిన కేసీఆర్ ప్రభుత్వం • సుంకిశాల ఘటనను వారం రోజులపాటు దాచిన కాంగ్రెస్ సర్కారు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): చెడు జరిగితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాపం.. మంచి జరిగితే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఘన కార్యం.. లేదా ప్రస్తుత రేవంత్ సర్కారు గొప్పతనం.. ఇదీ ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సర్వరోగ నివారిణిగా ఎంచుకున్న మంత్రం. అందుకే నిన్నటిదాకా తేలు కుట్టినట్టుగా వ్యవహరించిన ప్రభుత్వం సుంకిశాల ఘటన బయటికి రాగానే ఈ మంత్రాన్ని జపిస్తున్నది. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వ పాపమేనంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మరో మంత్రి పొన్నం ప్రభాకర్ సెలవిచ్చారు. హైదరాబాద్ మహా నగరం పదేండ్లలో గణనీయమైన అభివృద్ధిని సాధించిందనే ప్రశంసలు వస్తే మాత్రం అది ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాగితాలెక్కిన ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయాల పుణ్యమట. 24 గంటల కరెంటుకు చంద్రబాబు ఆద్యుడట. రేవంత్ ప్రభుత్వ హయాంలో గేట్లు బిగించి తప్పుడు అంచనాలతో సొరంగం తెరిచి రక్షణ గోడ విధ్వంసం జరిగితే మాత్రం దానికి కేసీఆర్ ప్రభుత్వం కారణమట! చెప్పేవారికి వినేవాళ్లు లోకువన్నట్టు ప్రభుత్వ పెద్దలు నోటికొచ్చినట్టు మాట్లాడుతూ పూట గడుపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుంకిశాల ఘటనపై గురువారం ప్రభుత్వ పెద్దల స్పందనే ఇందుకు నిదర్శనంగా చెప్తున్నారు. సుంకిశాల పాపం నిజంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనైతే మరి ఈ ప్రశ్నలకు సమాధానమేది?

- గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల వల్లనే ఈ ఘటన జరిగిందనుకుంటే, రిటెయినింగ్ వాల్ నిర్మాణం ఏడాది క్రితమే పూర్తయింది. ఆ తర్వాత కాలంలో ఘటన జరిగిన రోజు కంటే ఎక్కువ నీటిమట్టం నాగార్జునసాగర్‌లో కొన్ని నెలల పాటు ఉంది. అయినా చుక్క నీరు వాల్ వరకు ఎందుకు రాలేదు? అప్పుడు అది ఎందుకు కూలిపోలేదు?
- వారం రోజుల క్రితం సుంకిశాల ఘటన జరిగితే ‘నమస్తే తెలంగాణ’ కథనం వచ్చే వరకు ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు?
- ఘటన జరిగిన రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. నిజంగా ఇది బీఆర్ఎస్ పాపమే ఇది అయితే ప్రభుత్వ పెద్దలు అధికారికంగా అసెంబ్లీ వేదికగానే ఈ విషయాన్ని బయటపెట్టొచ్చు కదా! ‘నమస్తే తెలంగాణ’ బయటపెట్టిన తర్వాత ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నారు? అంటే బీఆర్ఎస్ పాపాన్ని ఏమైనా దాచాలనుకున్నారా? ఆ పార్టీని కాపాడాలనుకుంటున్నారా?
- ఘటన జరిగి వారం రోజులైనా జలమండలి ఉన్నతాధికారులుగానీ, ప్రభుత్వ పెద్దలుగానీ ప్రమాదంపై విచారణకు ఎందుకు ఆదేశించలేదు? ప్రతి అంశానికీ జ్యుడీషియల్ కమిటీ అంటూ ప్రకటనలు చేసే ప్రభుత్వ పెద్దలు దీనికి కమిటీ ఎందుకు వేయలేదు? ‘నమస్తే’ కథనం వచ్చిన తర్వాతనే మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిపై విచారణ కమిటీ వేస్తున్నామని ఎందుకు ప్రకటించారు?
- మేడిగడ్డలో 280 పిల్లర్ల బరాజ్‌లో ఒక పిల్లర్ కుంగితేనే రాహుల్‌గాంధీని హెలిక్యాప్టర్‌లో తీసుకెళ్లి హడావుడి చేసిన కాంగ్రెస్ ఒకటికి ఐదుసార్లు. మీడియా పర్యటనలు ఏర్పాటు చేసిన మంత్రులు.. మరి, సుంకిశాల బీఆర్ఎస్ పాపమైతే 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుంకిశాలకు వారం రోజుల్లో పర్యటనలు ఏర్పాటు చేసి, హడావుడి ఎందుకు చేయలేదు?

### గోప్యతలోనే ఉంది అసలు పాపం

**సుంకిశాల** బీఆర్ఎస్ పాపం అంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారు. కానీ ‘వారం రోజుల పాటు ప్రభుత్వం గోప్యత పాటించడం’తోనే అసలు పాపం ఎవరిదో తెలంగాణ సమాజం అర్థం చేసుకుంది. అంతేకాదు, గత ఎనిమిది నెలలుగా కమిటీలు, కమిషన్లు అంటూ ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ఎందుకు నోరు విప్పలేదనే ప్రశ్న కూడాతలెత్తుతున్నది.

## బీఆర్ఎస్‌కు.. కాంగ్రెస్‌కు ఎంత తేడా?

- **మేడిగడ్డ ఘటనలో వాస్తవాలు వెల్లడించిన బీఆర్ఎస్ ప్రభుత్వం**
- **సుంకిశాల దుర్ఘటనను దాచే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ సర్కార్**

**మేడిగడ్డ** ఘటన జరిగినపుడు బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించిన తీరు ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఘటన జరిగిన నిమిషాల వ్యవధిలోనే మీడియాకు సమాచారం ఇచ్చింది. తదుపరి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు బరాజ్‌పై రాకపోకలు నిలిపివేసింది. ఘటనపై బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే స్పందించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎల్అండ్‌టీ సంస్థతో అధికారికంగా ప్రకటన చేయించింది. వాస్తవాన్ని అందులో పొందుపరచడంతో పాటు ప్రభుత్వంపై భారం లేకుండా బరాజ్ పునరుద్ధరణ పనులు చేపడతామంటూ ఏజెన్సీ అందులో స్పష్టం చేసింది. ఒకవిధంగా ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి అది ప్రతికూల పరిణామం. అయినప్పటికీ విషయాన్ని దాచి పెట్టకుండా, జరిగిన వాస్తవాల్ని ప్రజల ముందు ఉంచింది. ఎక్కడా ఘటన జరగలేదంటూ గోప్యత పాటించలేదు. కానీ సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా వారం రోజుల పాటు గోప్యత పాటించింది. ‘నమస్తే తెలంగాణ’ వెలుగులోకి తెస్తే తప్ప జరిగిన వాస్తవాన్ని అంగీకరించలేదు. పైగా ఎదురుదాడికి ప్రయత్నిస్తున్నది.

### రెండు ఘటనల వెనుక వైరుధ్యమిదీ..

**మేడిగడ్డ** ఘటన అనేది ఎవరూ ఊహించనిది. శబ్దం వచ్చే వరకు అది ఎవరికీ తెలియలేదు. కానీ సుంకిశాల ఘటన అలా కాదు. షిఫ్టు మార్పు అనేది ప్రాణనష్టం జరగకపోవడానికి ఒక కారణమైనప్పటికీ అదే పూర్తి కారణం కాదు. ‘నమస్తే తెలంగాణ’ ఇంకా లోతైన విచారణ చేసిన సందర్భంగా మరో వాస్తవం కూడా బయటపడింది. గేటు అమర్చి, సొరంగాన్ని పూర్తిగా ఓపెన్ చేసిన తర్వాత నీటి ఒత్తిడికి గేటు క్రమంగా వంగిపోవడం అనేది నెమ్మదిగా జరిగింది. ఆ విషయాన్ని ముందుగానే కార్మికులు, ఇంజినీర్లు పసిగట్టారు. ఈ క్రమంలో ముందుగా లీకేజీ ప్రారంభమైంది. దీంతో ఆరు గంటల షిఫ్టు ముగించుకొని కార్మికులు అందరూ వాహనంలో పంపుహౌస్ బయటికి వచ్చేశారు. షిఫ్టు ముగిసినప్పటికీ కొందరు అక్కడే ఉండడం, ఇతరులతో మాట్లాడుతుండడం చేయడం సహజం. కానీ లీకేజీ మొదలైనందున అది కుప్పకూలిపోతుందని పసిగట్టే కార్మికులతో పాటు టెక్నీషియన్లు, సైట్ ఇంజినీర్లు అందరూ బయటికి వచ్చేశారు. ఆ క్రమంలోనే కొందరు వాహనంలో పైకి వస్తూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. అందుకే, బయటికొచ్చిన వీడియోలో ‘టూట్ గయా’ (విరిగిపోతుంది) అంటూ కార్మికులు అరవడం వినిపించింది. అంటే అది విరిగిపోనుందనే విషయం ముందుగానే పసిగట్టారు. నాసిరకం నిర్మాణమో, డిజైన్ లోపమో అయితే అనూహ్య ప్రమాదం జరగాలి. కానీ, వాల్ కూలిపోతున్నదని కార్మికులు ముందే గుర్తించారు. అంటే అంతకుముందు తమకున్న చర్య (సొరంగం తెరవడం) వల్ల ఇది జరుగుతున్నదనే సంగతిని వారు పసిగట్టి జాగ్రత్తపడ్డారు. దీంతో మేడిగడ్డ మాదిరిగా ఇది అనుకోని ఘటన కాదు.

# అసలేం జరిగిందంటే..

మొదటిపేజీ తరువాయి...


వరదతో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ ఎలాంటి ఆధారంలేని గేటును తన్నుకుంటూ జలాలు రిటెయినింగ్ వాల్‌ను నిలువునా కుప్పకూల్చాయి. అయితే, ఈ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టి వేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయత్నించినప్పటికీ, కొన్ని గంటల వ్యవధిలో జలమండలి అధికారికంగా ఇచ్చిన వివరణతో అసలు నిజం ఏంటనేది తేలిపోయింది. ఈ నేపథ్యంలో వాస్తవంగా ఏం జరిగింది? సుంకిశాల లోగుట్టు ఏందని ఓసారి పరిశీలిస్తే..

**జరగాల్సింది ఇదీ..**

సుంకిశాల పథకంలో భాగంగా నాగార్జున సాగర్ జలాశయం ఫోర్‌షోర్ నుంచి పంపు హౌజ్ వరకు మూడు సొరంగ మార్గాలను నిర్మించారు. నాగార్జునసాగర్ నీటిమట్టాన్ని ప్రామాణికంగా తీసుకొని వీటిని తవ్వారు. ఇందులో కింది భాగంలోని సొరంగం 137 మీటర్ల వద్ద ఏర్పాటు చేశారు. దాని వ్యాసం 8 మీటర్లు అయినందున సొరంగం 137–145 మీటర్ల వరకు ఉంటుంది. అదేవిధంగా మధ్యస్థ సొరంగాన్ని 157 మీటర్ల వద్ద ప్రారంభించారు. దీని వ్యాసం కూడా 8 మీటర్లు అయినందున ఇది 157–165 మీటర్ల వరకు ఉంటుంది. దీనిపై మరో సొరంగాన్ని నిర్మించారు. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం ఆధారంగా ఆయా సొరంగాలను ఓపెన్ చేసి, నీటిని పంపుహౌజ్‌లోకి తరలిస్తారు. అయితే నిర్మాణ సమయంలో మాత్రం సొరంగ మార్గాలను పూర్తిస్థాయిలో తవ్వరు. పంపుహౌజ్ నుంచి నాగార్జునసాగర్ జలాశయం వరకు ఉండే సొరంగ మార్గంలో జలాశయం వైపు మాత్రం కొంత భాగాన్ని తవ్వకుండా అలాగే ఉంచుతారు. దీని వల్లనే సాగర్‌లోని నీళ్లు సొరంగంలోకి రాకుండా ఉంటాయి. అన్ని పనులు పూర్తయిన తర్వాత, పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన తర్వాతనే ఈ సొరంగాన్ని ఓపెన్ చేస్తారు. కొన్ని సందర్భాల్లో నీళ్లలోనే పేలుళ్ల ద్వారా (వాటర్ బ్లాస్టింగ్) సొరంగంలో తవ్వని భాగాన్ని ఓపెన్ చేస్తారు. ముఖ్యంగా సొరంగంలో గేట్లు ఏర్పాటు చేసి, పంపుహౌజ్ స్లాబ్ వేసి.. ఆ స్లాబ్ నుంచి టైబీమ్స్‌ను గేటు వరకు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా నీటి ఒత్తిడికి గేటు కదలకుండా టైబీమ్స్ అదిమి పడతాయి. అదేవిధంగా నాగార్జునసాగర్‌లో నీటిమట్టం అనుకూలంగా ఉన్నపుడు ఈ సొరంగ మార్గాలను ఓపెన్ చేయాలి.

**జరిగింది ఇదీ...**

పంపుహౌజ్‌లో మోటార్లు ఏర్పాటు చేసేందుకు కొన్నిరోజుల క్రితమే సివిల్ పనులు మొదలపెట్టారు. అందుకోసం భారీ క్రేన్‌తో పాటు వంద మందికిపైగా కార్మికులు పంపుహౌజ్‌లో నిత్యం పని చేస్తున్నారు. పంపుహౌజ్ స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయి. గత నెలలో మధ్యస్థ సొరంగంలో గేటు అమర్చినప్పటికీ స్లాబ్ నుంచి టైబీమ్ ఇంకా నిర్మించలేదు. మరోవైపు నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి లక్షల క్యూసెక్కుల వరద మొదలైంది. ఈ సమయంలో సొరంగాన్ని ఓపెన్ చేయడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణం. మొత్తంగా చెప్పాలంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడం, కృష్ణా ప్రవాహంపై తప్పుడు అంచనాలు, ప్రొటోకాల్ పాటించకపోవడం వంటి కారణాలతోనే సుంకిశాల ఘటన సంభవించిందని తేటతెల్లమైంది.


నీళ్లు నిండక ముందు పంప్ హౌస్(ఫైల్)


ప్రస్తుతం నీటితో నిండిపోయిన సుంకిశాల పంప్ హౌస్


# ‘సుంకిశాల’ మరో ఏడాది ఆగాల్సిందేనా?

**అనాలోచిత నిర్ణయంతో వందల కోట్ల నష్టం! • ప్రత్యామ్నాయ చర్యల దిశగా మెట్రోబోర్డు**

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 8: అతిత్వరగా జంటనగరాలకు నీరు అందించాలనే రేవంత్ సర్కారు తొందరపాటు నిర్ణయం.. ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల నష్టాన్ని తేవడమేకాకుండా సుంకిశాల నీటి తరలింపును మరో ఏడాది వాయిదా వేసేలా చేసింది. నల్లగొండ జిల్లాలోని సుంకిశాల నుంచి కోదండపురం వరకు పైపులైన్ పనులు పూర్తి కావడంతో రెండు నెలల్లో ట్రయల్ రన్ చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించగా.. అవి ఆదిలోనే విఫలమై, పంప్‌హౌస్ జల దిగ్బంధంలో చిక్కుకున్నది. ఏఎమ్మార్పీ నుంచి కాకుండా జంటనగరాలకు సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి తాగునీరు అందించే పథకంలో భాగంగా పెద్దవూర మండల జయరాం తండా సుంకిశాల వద్ద రూ.2000 కోట్లతో పంప్‌హౌస్ పనులకు గత సంవత్సరం శ్రీకారం చుట్టారు. ఇక్కడి నుంచి కోదండపురం ప్లాంట్ వరకు మూడు పైపులైన్ల ద్వారా ఏఎమ్మార్పీతో సంబంధం లేకుండా నేరుగా సాగర్ నుంచే నీటిని తరలించేందుకు పనులు జరుగుతున్నాయి. పంప్‌హౌస్‌తోపాటు ఇన్‌టేక్ వెల్‌లో మూడు సొరంగ నిర్మాణపు పనులను ప్రారంభించారు. సాగర్ బ్యాక్ వాటర్ నుంచి మూడు లెవల్స్ ద్వారా నీటిని తీసుకునేందుకు మూడు సొరంగాలు తవ్వారు. మధ్య సొరంగానికి గేట్‌ను అమర్చి రిటైనింగ్ వాల్ ఏర్పాటుచేశారు. లోపలి భాగంలో టన్నెల్ ఇన్‌లెట్‌ను తెరవడంతో నీటి ఉధృతికి టన్నెల్ గేట్‌తోపాటు రక్షణ గోడ కూడా కుప్పకూలాయి. బయటి ప్రపంచానికి తెలియకుండా వారంపాటు పంప్‌హౌస్ పనులు నిలిపి వేసి ప్రత్యామ్నాయ చర్యల దిశగా అధికారులు అడుగులు వేస్తున్నా సాధ్యపడలేదు. బుధవారం జలమండలి సీజీఎం, డీఎం, డీజీఎం ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై కోదండపురం అతిథి గృహంలో చర్చించారు. ప్రస్తుతం పంప్‌హౌస్‌లో నీటిని తరలించే పరిస్థితి లేకపోవడంతో టన్నెల్‌కు పైభాగంలోనే పనులు చేయాల్సిన దుస్థితి వచ్చింది.

# నిజాలను త్వరలోనే నిగ్గు తేల్చుతాం

- **సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దే**
- **విరిగిపడ్డ గోడపై విచారణకు ఆదేశం**
- **మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్**
- **‘నమస్తే తెలంగాణ’ కథనంపై ఫైర్**



భీమదేవరపల్లి, ఆగస్టు8: విరిగిపడిన సుంకిశాల ప్రాజెక్టు గోడపై నిజాలను త్వరలోనే నిగ్గు తేల్చుతామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ‘నమస్తే తెలంగాణ’ దినపత్రికలో ప్రచురితమైన ‘విరిగిపడ్డ సుంకిశాల గోడ, తప్పిన పెను ప్రమాదం’ కథనంపై తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా హైదరాబాద్‌కు నీళ్లు తీసుకొచ్చే ప్రక్రియలో భాగంగా హెచ్ఎండీఏ, మెట్రోవర్క్స్ అధికారులను విచారణకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. గోడ కూలిన పాపం బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. ఒక వార్త రాసి ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బట్టకాల్చి మీద వేసే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తున్నదని, తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. సుంకిశాలపై దర్యాప్తు ప్రాథమిక రిపోర్టు రాగానే ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు.

# అనూహ్య ప్రవాహంతోనే కూలిన గోడ

- **సొరంగం వద్ద నీటి ఒత్తిడి పెరిగి గేటు కూడా ధ్వంసం**
- **సైడ్‌వాల్ పునఃనిర్మాణానికి రూ.20 కోట్లు ఖర్చు అంచనా**
- **ఈ ఖర్చు నిర్మాణ సంస్థనే భరిస్తుంది**
- **పనులు 2 నెలలు ఆలస్యమవుతాయి**
- **ఘటనపై విచారణ కమిటీ**
- **‘సుంకిశాల’పై జలమండలి వివరణ**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 08 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్‌లో అనూహ్యంగా నీటి ప్రవాహం పెరగడం వల్లనే సుంకిశాలలో టన్నెల్‌గేట్ ధ్వంసమైందని, సైడ్‌వాల్ కుప్పకూలిందని హైదరాబాద్ జలమండలి తెలిపింది. ఇప్పుడున్న నీటి లెవల్ తగ్గిన తరువాత సైడ్‌వాల్ పునఃనిర్మాణ పనులు చేపడతామని, ఇందుకు రూ.20 కోట్లు ఖర్చవుతుందని పేర్కొంది. ఈ ఖర్చును నిర్మాణ సంస్థనే భరిస్తుందని జలమండలి అధికారులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే వేసవిలోగా హైదరాబాద్ జంటనగరాలకు తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో సుంకిశాల మిడిల్ టన్నెల్ పూర్తిచేయాలని నిర్ణయించామని తెలిపారు. రిజర్వాయర్‌కు వరద ఆలస్యంగా వస్తుందని, ఈ నెలాఖరులోగా మధ్య టన్నెల్ స్థాయికి నీటి స్థాయి పెరుగుతుందన్న అంచనాతో పనులు చేపట్టామని వివరించారు. వరద ప్రవాహం పెరిగేలోగా టన్నెల్‌కు అవసరమైన టై భీమ్‌లను పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని, అందులో భాగంగానే గత నెల 29, 30, 31 తేదీల్లో మధ్య సొరంగానికి గేట్‌ను అమర్చామని తెలిపారు. రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించి, సివిల్ వర్క్స్ టీమ్‌లు సైడ్‌వాల్స్ మధ్య.. టై బీమ్ కనెక్టివిటీని కాస్టింగ్ చేసే పనిలో ఉండగా.. ఇంతలోనే సాగర్‌కు ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిందని పేర్కొన్నారు. దాదాపు 3.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అకస్మాత్తుగా బ్యాక్‌క్లోజ్ వేవ్ యాక్షన్ పెరిగి నీళ్లు టన్నెల్లోకి తన్నుకువచ్చాయని వివరించారు. దీంతో టన్నెల్ గేటు ధ్వంసమై..దానికి అనుసంధానంగా ఉన్న సైడ్‌వాల్ కూలిపోయిందని, ఇదంతా ఐదు నిమిషాల స్వల్ప వ్యవధిలోనే జరిగిందని తెలిపారు. సైడ్‌వాల్ పొడవు 270 మీటర్లు. వెల్ లోపల నిర్మించిన మొత్తం గోడల పొడవు సుమారు 1020 మీటర్లు ఉండగా.. ఇందులో ప్రస్తుతం 50 మీటర్ల మేర గోడ కూలిందని పేర్కొన్నారు. ఈ పనులన్నీ 2022 జూలైలో ప్రారంభమై 2023లో పూర్తయ్యాయని తెలిపారు. సైడ్‌వాల్ మొత్తం పొడవులో.. మూడు బ్లాకుల్లో కేవలం మధ్యలో ఉన్న గేటు టన్నెల్ మాత్రమే కూలిందని, ఎదురుగా ఉన్న పంప్‌హౌస్ భాగం ఇప్పటికే సాగర్ లెవల్‌కు చేరుకున్నదని అధికారులు పేర్కొన్నారు.



**60 శాతం పనులు పూర్తి**

సుంకిశాల ప్రాజెక్టు పనులు 2021 జూలైలో ప్రారంభం కాగా.. ఇన్‌టేక్ వెల్ పనులు 2022 మార్చిలో, సైడ్‌వాల్ నిర్మాణ పనులు అదే ఏడాది జూలైలో మొదలుపెట్టామని వివరించారు. టన్నెల్ వైపున్న సైడ్‌వాల్స్ 2023 జూలైలోనే పూర్తి చేశామని తెలిపారు. 2023 డిసెంబరు నాటికి మొత్తం 4 సైడ్‌వాల్ బ్లాకుల్లో మూడు.. రిజర్వాయర్ పూర్తిస్థాయి ఎత్తు (180 మీటర్లు) వరకు పూర్తయ్యాయని తెలిపారు. సంపు ఫ్లోర్ లెవల్ 137 మీటర్లు ఉండగా.. ఈ కాలంలో 43 మీటర్ల నిర్మాణం పూర్తిచేశామని వివరించారు. ఈ ఏడాది జనవరి నాటికి నాలుగో సైడ్‌వాల్ బ్లాక్ పనులు రూఫ్ స్లాబ్ లెవల్ వరకు జరిగాయని, 2023 డిసెంబరు నాటికి అన్ని రకాల పనులు 60 శాతం పూర్తయ్యాయని తెలిపారు. సుంకిశాలలో సైడ్‌వాల్ కూలిన ఘటనపై జలమండలి ఈడీ సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌తో విచారణ కమిటీని వేసినట్టు తెలిపారు.

### 20 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా

**పంప్‌హౌస్‌లోకి** నీటిని ఎత్తిపోయడానికి ప్రతిపాదించిన మూడు సొరంగాల పనులు 90శాతం పూర్తయ్యాయని జలమండలి అధికారులు తెలిపారు. ప్రత్యేక నైపుణ్య కార్మికులతో ఈ పనులు జరుగుతున్నాయని, నీటి లెవల్ తగ్గిన తర్వాత.. దెబ్బతిన్న సైడ్‌వాల్ పునఃనిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. దీనికి సుమారు 20 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, ఈ మొత్తాన్ని సదరు నిర్మాణ సంస్థనే భరిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు సుంకిశాల ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్ పనులు 60 శాతం, పంపింగ్ మెయిన్ పనులు 70 శాతం, ఎలక్ట్రో మెకానికల్ పనులు 40 శాతం పూర్తయ్యాయని తెలిపారు.